

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం పరిశీలించారు. ఈవీఎంల తనిఖీని చేయడంతో పాటు ఈసీఐఎల్ ఇంజనీర్లతో సమీక్షించారు. ఫస్ట్‌లెవల్ చెకింగ్‌ను పరిశీలించారు. ఈవీఎంలకు లోటెస్ట్ నిర్వహణను ఇంజనీర్ల సమక్షంలో చూశారు. కంట్రోల్ యూనిట్‌కు నాలుగు బ్యాలెట్ యూనిట్లను అనుసంధానం చేసి వాటి పనితీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ ఇతర అధికారులు ఉన్నారు.

• బాగేపల్లిలో యథేచ్ఛగా మొరం తవ్వుతున్న దృశ్యం



తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత!

- జిల్లాలో జోరుగా మొరం, మట్టి అక్రమ తవ్వకాలు
- బొందలగడ్డలుగా.. ప్రభుత్వ భూములు
- లక్షలాది రూపాయల ప్రభుత్వాదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

> జిల్లాలో మొరం, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొరం తవ్వకాలను ఇష్టానుసారంగా చేపడుతున్నారు. ప్రభుత్వ భూములను బొందలగడ్డలుగా మారుస్తున్నారు. దీంతో జిల్లాలో పరిస్థితి 'తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత' అన్న చందంగా మారింది. కొందరు వ్యాపారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మట్టి, మొరానికి డిమాండ్ పెరిగింది. ఇళ్ల నిర్మాణం, వెంచర్లు, వ్యవసాయానికి అత్యధిక వినియోగం ఉండటంతో అక్రమంగా తవ్వకాలను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల పరిధిలోని ప్రభుత్వ భూములు, గుట్టలలో తవ్వకాలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎక్కువగా రవాణా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల గుట్టలు ఈ తవ్వకాల వల్ల తరిగిపోతున్నా ఒత్తిళ్లు, ఇతర కారణాలతో అధికారులు ఆ వైపు చూడటం లేదు. కొన్నిచోట్ల నామమాత్రం ఫైన్‌లతో అక్రమ రవాణాదారులు తప్పించుకుంటున్నారు. మట్టి, మొరం అవసరాలు పెరిగినందున జిల్లాలోని పలు మండలాల పరిధిలో అనుమతులు ఇస్తే ఈ అక్రమ రవాణాకు చెక్ పడే అవకాశం ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పెరిగిన భవన నిర్మాణాలు

జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణం భారీగా పెరిగింది. అన్ని గ్రామాల పరిధిలో ప్రతి సంవత్సరం కొత్త ఇండ్ల నిర్మాణం జరుగుతుంది. ఈ ఇండ్ల నిర్మాణం కోసం మట్టి, మొరం అవసరం పెరిగింది. మండల స్థాయిలో లేదా గ్రామ స్థాయిలో తవ్వకాలకు అనుమతులు ఇవ్వకపోవడం వల్ల ఎక్కువ మంది అక్రమ మొరం, మట్టి సరఫరా దారులపై ఆధారపడుతున్నారు. వారి ద్వారానే కొనుగోలు చేస్తున్నారు. వీరితో పాటు వెంచర్ల నిర్మాణానికి, వ్యవసాయానికి అవసరాలు పెరగడం వల్ల మట్టికి డిమాండ్ పెరిగింది. నర్సరీలకు, రోడ్ల నిర్మాణానికి మొరాన్ని ఉపయోగిస్తున్నారు. అనుమతులు ఉన్న క్వారీల నుంచి సరఫరా చేసిన జిల్లాలోని ఇతర మండలాలకు దూరం ఎక్కువగా ఉండటం వల్ల తమకు దగ్గరగా రవాణా చేసేవారి పైనే ఆధారపడుతున్నారు. వారు చెప్పే రేటుకు కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. మొరం, మట్టి ఎక్కువగా అవసరం ఉన్న వారు మండలస్థాయి అధికారులను కలిసి అనుమతులు ఇవ్వాలని కోరినా.. అవకాశం లేకపోవడం వల్ల ఈ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి.

నగరం చుట్టూ అక్రమ తవ్వకాలు

నిజామాబాద్ నగరం చుట్టూ మాక్లూర్, ఎడపల్లి, మోర్తాడ్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి మండలాల పరిధిలో భారీగా ఈ మట్టి, మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గుట్టలు, అటవీ ప్రాంతాల్లో రాత్రివేళల్లో జేసీబీల ద్వారా తవ్వకాలను చేస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ రవాణా ఎక్కువ మొత్తంలో జరుగుతున్న పట్టించుకునే వారు లేరు. కొన్నిచోట్ల టాస్క్‌ఫోర్స్, మైనింగ్, పోలీసు అధికారులు పట్టుకున్న ఫలితం ఉండటం లేదు. మండలాల స్థాయిలో తెలిసే ఈ వ్యవహారం జరుగుతున్నా కిందిస్థాయి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల వారికి సహకరిస్తున్నారు. మండల స్థాయి నేతల కనుసన్నల్లో ఇవి జరుగుతుండటం వల్ల కొన్ని చోట్ల అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని మండలాల పరిధిలో సిండికేట్‌గా మారి మట్టి, మొరం తవ్వకాలను చేసి సరఫరా చేస్తున్నారు.

ముగ్గురు వ్యక్తుల ఆధ్వర్యంలో తవ్వకాలు!

నిజామాబాద్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు పూర్తిస్థాయిలో మట్టి, మొరం తవ్వకాలు కొనసాగిస్తున్నారు. నాగారం ప్రాంతంలో ఒకరి నియంత్రణలోనే ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి. నగరం చుట్టూ మండలాల పరిధిలో ఇదే పరిస్థితి ఉంది. టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర అధికారులు వాహనాలు సీజ్ చేసినా ఆగడం లేదు. ఇతర మార్గాల ద్వారా తవ్వకాలు చేస్తున్నారు. మట్టి, మొరం వాహనాలను సీజ్ చేసినా రూ.1500లలోపే జరిమానా ఉండటం వల్ల ఎక్కువ మొత్తంలో అక్రమ దారులు బయపడకుండా ఈ తవ్వకాలను చేస్తున్నారు. మట్టి, మొరం కోసం ప్రతి మండలంలో అధికారుల చుట్టూ పలువురు తిరుగుతున్నా ఫలితం మాత్రం ఉండటం లేదు. మట్టి, మొరం తవ్వకాలకు ప్రభుత్వమే అనుమతి ఇస్తే రాయాల్టి కింద వినియోగదారుడే డబ్బులు చెల్లిస్తే ఆదాయం కూడా రానుంది. ఇసుక తరహాలో మట్టి తవ్వకాలు కూడా అన్ని మండలాల పరిధిలో అనుమతులు ఇవ్వాలని పలువురు అధికారులను కోరుతున్నారు. జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులతో పాటు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు కూడా వారు నివేదించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు మంజూరు చేస్తే మట్టి, మొరం అక్రమ తవ్వకాలు ఆగే అవకాశం ఉంది.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. గిరిజన శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వినాయక్‌నగర్‌లోని సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేశారు. మహనీయుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉంటూ సమాజహితానికి పాటుపడాలని శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు చేశారని ఆయన గుర్తుచేశారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, అధికారులు పాల్గొన్నారు.



సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

నేడు జిల్లాకు మహేష్‌కుమార్, షబ్బీర్‌ల రాక

• భారీ ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్ శ్రేణులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: ఎమ్మెల్సీగా ఎన్నికైన పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీలు శుక్రవారం జిల్లాకు రానుండటంతో పార్టీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వారు మధ్యాహ్నం 1.30లకు నిజామాబాద్‌కు చేరుకోనున్నారు. నిజామాబాద్‌లోని బోర్గాం నుంచి స్వాగత ర్యాలీని నిర్వహించేందుకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేశారు. బోర్గాం నుంచి నగరంలోని అన్ని వాడల మీదుగా తిరుగుతూ ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో సన్మాన సభ నిర్వహించనున్నారు. ఈ స్వాగత సభలో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్‌తో పాటు ఇతర నేతలు పాల్గొంటారని జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణులు తెలిపారు. ఈ సన్మాన సభలో జిల్లాలోని పార్టీ నేతలందరూ పాల్గొంటారని తెలిపారు.

బీఆర్ఎస్‌కు భారీ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత
- జిల్లాలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీలోకి వలసలు

బోధన్ రూరల్/ఖిల్లా, ఫిబ్రవరి 15: జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఎడపల్లి జడ్పీటీసీ, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్ గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రజితా యాదవ్ దంపతులు తిరిగి తమ సొంత గూటికే చేరారు.

ఇదే బాటలో మరి కొందరు..

బోధన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఎడపల్లి మండలానికి చెందిన పార్టీ మండల మాజీ అధ్యక్షుడు న్యావనంది సుభాష్, రైతు సమన్వయ సమితీ అధ్యక్షుడు బంజ శంకర్, ఎడపల్లి ఎంపీటీసీ 2 నాయిడి స్రవంతి పోతన్న వారం రోజుల క్రితమే కాంగ్రెస్‌లో చేరారు. వీరి బాటలోనే మరికొందరు ప్రజాప్రతినిధులు నడుస్తారనే చర్చ కొనసాగుతోంది. మరోవైపు జిల్లాలో కాంగ్రెస్ ఎంపీని గెలిపించుకునేందుకు తనదైనశైలిలో వ్యూహాలు రూపొందిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, జైతాపూర్ సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటి లింగం తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ వైస్ చైర్మన్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్‌ను 'ఇందూరు'గా మార్చాలి

• అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ధన్‌పాల్

పెద్దబజార్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర చిహ్నం టీఎస్‌ను టీజీగా మార్చారని అలాగే ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిజామాబాద్ జిల్లా పేరును ఇందూరుగా మార్చాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. నిజామాబాద్‌ను ఇందూరుగా పేరు మార్చడంతో పాటు హైదరాబాద్‌ను భాగ్యనగర్‌గా, ఆదిలాబాద్‌ను ఆదిలాపూర్‌గా, వరంగల్‌ను ఓరుగల్లుగా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం అని చెప్పి నియోజకవర్గంలో అర్హులైన వారికి ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అధ్వాన స్థితిలో ఉన్నాయని గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కనీస మౌలిక సౌకర్యాలు కూడా లేవని అన్నారు. ఇన్‌చార్జి మంత్రి స్పందించి వెంటనే నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



నేడు కంఠేశ్వర జాతర

- రథంపై ఊరేగనున్న నీలకంఠేశ్వరస్వామి
- దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: భక్తుల కోరిన కోరికలు తీర్చే నీలకంఠేశ్వర స్వామి జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. రథసప్తమి పర్వదినాన భక్తులకు రథంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. రథసప్తమి రోజున స్వామికి నిర్వహించే జాతర పెద్దఎత్తున జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నీలకంఠేశ్వర స్వామి రథసప్తమి పర్వదినాన భక్తులకు రథంపై దర్శనమిస్తారు. రథసప్తమి పర్వదినం అనగానే గుర్తుకు వచ్చేది ప్రసిద్ధ శైవక్షేత్రంగా వీరాజిల్లుతున్న నీలకంఠేశ్వరుడి రథోత్సవం వంద సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ రథోత్సవం చూడడానికి రెండు కన్నులు సరిపోవు. ప్రతియేటా రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని పార్వతిసమేతులై నీలకంఠేశ్వరస్వామి ఆలయ పురవీధుల గుండా రథంపై విహరిస్తాడు. రథోత్సవ జాతరను పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచేకాక పక్క రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. చరిత్రాత్మక నీలకంఠేశ్వర గోపుర ప్రతిష్టరోజునే రథం తయారుచేసినట్లు తెలుస్తోంది. నాటి నుంచి గోపురాన్ని ఆలయ చరిత్రానుసారం మాఘశుద్ధ సప్తమి తిథినాడు శిఖరస్థాపన జరిగిందని శాసనం తెలుపుతుంది. శిఖర స్థాపన నాడు శిల్పసద్ది తీసుకొచ్చిన తల్లితో తాను శిఖరస్థాపన పనిలో ఉన్నానని వెనుతిరిగి చూడకుండా ఇంటికి వెళ్లమని విచిత్రమైన సూచన చేసాడని స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. కుమారుని సూచన మధనపడి పుత్రవాత్సల్యానికి లోనై ఆలయ శిఖరంవైపుకు తల్లి చూసిందట. దీంతో శిఖరస్థాపన చేస్తున్న శిల్పి అదృశ్యం కావడం, తల్లి సమాధి కావడం ఏకకాలంలో జరిగిపోయాయి. రథసప్తమి పర్వదినాన నీలకంఠేశ్వరస్వామి రథంపై ఊరేగుతున్న దృశ్యాన్ని నేటికి శిల్పి తల్లి వచ్చి చూస్తారని భక్తులు విశ్వసిస్తారు.

కోరిన కోరికలను తీర్చే కంఠేశ్వర రథం

భక్తుల కోరిన కోరికలను తర్చేస్వామిగా నీలకంఠేశ్వర రథోత్సవానికి పేరుంది. ఏటా భక్తులు తమ కోరికలను తీర్చమని వేడుకుంటూ రథానికి తొట్లెను కట్టడం ఆనవాయితీగా వస్తుంది. జాతర సందర్భంగా విద్యుత్ వెలుగులతో దేవాలయాన్ని అలంకరించారు.



టీయూలోని సమస్యలను పరిష్కరించాలి: పీడీఎస్‌యూ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15: తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ వర్సిటీలో బాలికల హాస్టల్ సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. టీయూలో హెల్త్ కేర్ సెంటర్, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, మెస్ బిల్లులకు నిధులు ఉంచాలని పేర్కొన్నారు.







రూ.50 కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం పక్కదారి

● రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు

కోటగిరి,ఫిబ్రవరి15: రూ.50కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన రైస్‌మిల్ యజమానిపై నిజామాబాద్ జిల్లా కోటగిరి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కోటగిరి మండలం కారేగాం గ్రామంలోని అర్కం ఇండస్ట్రీస్ యాజమాన్యం 52కోట్ల రూపాయలకుపైగా ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుంది. 2001-22 ఖరీఫ్, 2022-23 రబీ సీజన్‌లో సివిల్ సప్లై ద్వారా ధాన్యం తీసుకుంది. తీసుకున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. రైస్‌మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇటీవల జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో.. పౌర సరఫరాల శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అర్కం ఇండస్ట్రీలో తనిఖీలు నిర్వహించగా.. ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. సుమారు 2 కోట్లకుపైగా సీఎంఆర్ ధాన్యాన్ని మాత్రమే సివిల్ సప్లైకి అప్పగించినట్లు తేలింది. మిగిలిన రూ.50కోట్ల విలువ చేసే ధాన్యం లేకపోవడంతో.. అధికారులు రైస్‌మిల్ యజమాన్యంపై చర్యలు చేపట్టారు. ఈవిషయమై జిల్లా సివిల్ మేనేజర్ జగదీష్ ఈనెల 10వ తేదీన కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్కాం ఇండస్ట్రీస్ యాజమాని సాయిరాంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంబంధిత యజమానిపై 406, 409, 417, 420 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరిపి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.


నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

రెంజల్, ఫిబ్రవరి 15: గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలే ఈ ప్రభుత్వం చేయకుండా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను నిలువున మోసం చేసిన ఘనత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలదేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఫ్యాక్టరీని తెరిపించి పూర్వవైభవం తీసుకువస్తాని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఫ్యాక్టరీ కార్మికుల పొట్టలు కొట్టారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులను నిలువునా ముంచారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అయినా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ పాలనలో అక్రమ ఇసుక రవాణా చేపట్టి ప్రభుత్వ అధికారులపై దాడులు చేసి ఖండ్‌గావ్ గ్రామానికి చెందిన కాందారుని దౌర్జన్యంగా చితకబాదారని గుర్తుచేశారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండి అక్రమంగా ఇసుక రవాణా చేయగా.. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని అన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, మాజీ మండల అధ్యక్షుడు మేక సంతోష్, కిషోర్, బీజేపీ నాయకులు న్యావనంది గోపాల్, పోచయ్య, రమేష్ తదితరులున్నారు.

నెంబర్‌ప్లేట్ లేని బైక్‌లు సీజ్

ముప్కాల్, ఫిబ్రవరి 15: నెంబర్ ప్లేటు లేని బైక్‌లను తాత్కాలికంగా సీజ్‌చేసి జరిమానా విధించినట్లు ఎస్సై బాస్కరచారి తెలిపారు. గురువారం ముప్కాల్ మండలకేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని 10 బైక్‌లను తాత్కాలిక సీజ్ చేసి జరిమానా వేసి నెంబర్ ప్లేటు పెట్టించిన తర్వాతే ఆ బైక్‌లను వారికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా తప్పుడు నెంబర్‌లకు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రతీఒక్కరు తమ వాహనాలకు నెంబర్‌ప్లేట్ ఉంచాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లలో ప్రయాణించడం ప్రమాదకరమని వాహనదారులకు అవగాహన కల్పించారు.





ఎస్ఆర్ఎన్‌కే కళాశాలకు స్వయం ప్రతిపత్తి



హోదా గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బాన్సువాడలో గల ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించిన ఆర్డర్ కాపీని గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి కళాశాల యాజమన్యానికి అందజేశారు. ఈ గుర్తింపు 2024-25 విద్యాసంవత్సరానికి వర్తిస్తోందని, యూజీసీ నుంచి గుర్తించబడిందని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. అటానమస్ గుర్తింపుతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యాబోధనతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. గంగాధర్, అధ్యాపకులు విఠల్, కృష్ణ పాల్గొన్నారు.

నకిలీ విలేకర్లను పోలీసులకు పట్టించిన గౌడ సంఘం ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి15: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో గల కల్లు బట్టిలో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసిన నకిలీ విలేకర్లను గౌడ సంఘం ప్రతినిధులు పట్టుకొని గురువారం డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. గత రెండు రోజులుగా కల్లుబట్టి నిర్వాహకులను డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురిచేసిన డిచ్‌పల్లికి చెందిన గంగాధర్, ఆర్మూర్‌కి చెందిన సాయిప్రణీత్‌లపై గౌడ కులస్థులు పోలీసులకు సమాచారం అందించారు. గౌడ ప్రతినిధులు వారిని నిలదీసి తమపై దాడి చేస్తున్నారని ముందస్తుగా డయల్ 100కు సమాచారం చేరవేసి పోలీసులకు అప్పగించారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపిక

రెంజల్, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కీర్తన అథ్లెటిక్ విభాగం షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో గురువారం విద్యార్థిని కీర్తనను పాఠశాల ప్రిన్సిపాల్ హర్షియా నాజం, వ్యాయామ ఉపాధ్యాయురాలు భాగ్యశ్రీ అభినందించారు. ఈనెల 16నుంచి 18వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో విద్యార్థిని కీర్తన పాల్గొననుందని తెలిపారు.

ఆర్టీఏ డీటీసీ వెంకటరమణ బదిలీ

● నూతన డీటీసీగా దుర్గాప్రమీల

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి15: జిల్లా రవాణాశాఖ డీటీసీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.వెంకటరమణ బదిలీ అయ్యారు. ఆయనను సంగారెడ్డి డీటీసీగా నియమించారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్‌లో డీటీసీగా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రమీళను నియమించారు. దుర్గాప్రమీళ స్థానంలో సంగారెడ్డి డీటీసీగా ఉన్న శివలింగయ్యను బదిలీ చేశారు. వెంకటరమణ 7 జనవ 2021న డీటీసీగా బాధ్యతలు చేపట్టారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తికావడంతో ఆయనను బదిలీచేశారు. ఎంవీఐ యశ్వంత్‌ను ఆదిలాబాద్‌కు బదిలీచేశారు. ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావుకు నిజామాబాద్‌కు బదిలీచేశారు. ఇద్దరు అధికారులు కూడా చార్జి తీసుకోలేదు. డీటీసీ వెంకటరమణ ఎంవీఐ కిరణ్‌కు ప్రస్తుతం చార్జి అప్పజెప్పి సంగారెడ్డికి వెళ్లారు. దుర్గాప్రమీళ గతంలో నిజామాబాద్‌లో డీటీవోగా రెండేళ్లు విధులు నిర్వహించారు.

బోధన్ పట్టణ అభివృద్ధికి కృషి: కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి15: బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఖమర్ అహ్మద్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకటనారాయణ బోధన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో పర్యటిస్తారని, ప్రజా సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. పట్టణ అభివృద్ధికి బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డితో పాటు వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి: ఏసీపీ

బోధన్‌రూరల్, ఫిబ్రవరి15: బోధన్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన అన్నారు. అక్రమ ఇసుక, గంజాయిని అరికడతామని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు ఏసీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలి'

నందిపేట, ఫిబ్రవరి15: ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మహ్మద్ షబ్బీర్ అలీ జిల్లాకు మొదటిసారిగా వస్తున్న సందర్భంగా శుక్రవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్న విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు కోరుతూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోర్గాం నుంచి ప్రగతీనగర్‌లోని మున్నూర్‌కాపు కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ ఉంటోందని, అనంతరం అభినందన సభ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని డీసీసీ ఉపాధ్య క్షుడు పెంట ఇంద్రుడు కోరారు.

రూరల్ డీటీగా వినయ్‌సాగర్

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 15: రూరల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వినయ్‌సాగర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు రూరల్ డీటీగా విధులు నిర్వహించిన రంజిత్‌కుమార్ నిర్మల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాలలో డీటీగా విధులు నిర్వహిస్తున్న వినయ్‌సాగర్‌కు ఇక్కడకు బదిలీచేశారు. గురువారం ఆయన రూరల్ తహసీల్దార్ జి.అనురుద్‌ను కలసి విధుల్లో చేరారు.

కబడ్డీ పోటీలకు కేటీఎస్ విద్యార్థి ఎంపిక

ముప్కాల్, ఫిబ్రవరి15: బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థి సిహెచ్.రాజు రాష్ట్రస్థాయి అండర్-16 జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ తెలిపారు. జరిగే నేటి నుంచి రెండు రోజుల పాటు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో విద్యార్థిని సీహెచ్.రాజు పాల్గొనున్నారు. ఈనెల 7న ముప్కాల్‌లో నిర్వహించిన సెలక్షన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లాజట్టులో పాల్గొనేందుకు ఎంపికైనట్లు తెలిపారు.

తండాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇస్తా

● ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



అమ్రాద్‌తండాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఫిబ్రవరి15: వెనుకబడిన తండాలను అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ మొదటి ప్రాధాన్యతనిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మానిక్‌బండార్‌తండా, అమ్రాద్‌తండా సేవలాల్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేలావల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ తండా ప్రజలు నిత్యం ప్రకృతితో మమేకంతో ఉంటారని, తండా ప్రజలు కంటి ప్రతిరూపమని, సేవలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలి’



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ట్రాన్స్‌జెండర్లు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వారికి రక్షణ కల్పించాలని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ట్రాన్స్‌జెండర్లపై దాడులు గత కొంత కాలంగా కొనసాగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరారు. ఎక్కడ ఎవరు దాడి చేస్తారోనని ట్రాన్స్‌జెండర్లు ఆందోళన చెందుతున్నారని వారు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌తో పాటు ట్రాన్స్‌జెండర్ల నాయకులు గంగ, జరీనా, అలక, రక్ష ఆరతి, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు కొత్తగా రెండు కోర్టుల మంజూరు

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 15: తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలో మరో రెండు కోర్టులు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు కం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మరియు 5వ అదనపు జుడిషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్. ఈ రెండు నూతన కోర్టులను ఈ నెల 17న శనివారం ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి హైకోర్టు, హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ ఎన్.తుకారాం చేతుల మీదుగా ప్రారంభిస్తారు. జిల్లాలో పెండింగ్ కేసులు అధికంగా ఉండటంతో ఈ కొత్త కోర్టులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ అదనపు కోర్టులతో కేసులు త్వరితగతిన పూర్తికానున్నాయి.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



బోధన్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న గిరిజనులు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 15:బోధన్ పట్టణంలోని గిరిజన వసతి గృహంలో గురువారం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంజారాల ఆరాధ్య దైవమైన సంత్‌శ్రీసేవాలాల్ మహరాజ్‌కు అనవాయితీ ప్రకారం బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు జాదవ్ ప్రవీణ్ నాయక్, చౌహాన్, వసంత్ జాదవ్, కిరణ్, వసురామ్ నాయక్, మధు, తిక్యానాయక్, శ్రీనివాస్, పీరు సింగ్, గబ్బర్, సాయికృష్ణలతో హాస్టల్ వార్డెన్ అంజాద్‌లు పాల్గొన్నారు.

ఇందల్వాయి:గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను గురువారం ఇంద ల్వాయి మండల కేంద్రంలో పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు. గిరిజనులు సేవాలాల్ జెండా గద్దెలు నిర్మించిన స్థలం ప్రస్తుతం కోర్టు కేసులో ఉన్నందున అక్కడికి ఎవరిని అనుమతించడం లేదని డిచ్‌పల్లి సీఐ మల్లేష్ తెలిపారు. ఇక్కడ 144 సెక్షన్ కొనసాగుతుండటం వల్ల వేడుకలకు ప్రజలను అనుమతించడం లేదని కేవలం సీపీ నుంచి అనుమతి తెచ్చుకున్న 15 మంది గిరిజన నాయకులను మాత్రమే అనుమతించడంతో వారు సేవాలాల్ మహరాజ్ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్‌బండార్ వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుండగా ఇక్కడ ప్రజలను అనుమతించకపోవడం సిగ్గుచేటని అన్నారు. సేవాలాల్ మహరాజ్ నిరంతరం గిరిజనుల శ్రేయస్సు కోసం పాటుపడిన మహనుభావుడని కొనియాడారు. గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా ఈ స్థాయిలో ఉన్నారంటే ఆఘనత సేవాలాల్ మహరాజ్‌దేనని అన్నారు. ఈకార్యక్రమంలో గిరిజనుల జిల్లా సదర్ నాయకుడు రాజునాయక్, మండల అధ్యక్షుడు తుకారాం నాయక్, పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: సంత్ సేవాలాల్ మహరాజ్ 285 జయంతి వేడుకలను మండలంలోని గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ యువజ విభాగం మండల అధ్యక్షుడు నేనావత్ నరేందర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘ అధ్యక్షుడు బాదావత్ శర్మనాయక్, లింగంనాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామంలో గురువారం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు.

ఏర్గట్ల:గిజనుల ఆరాధ్య. దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని గురువారం మండలంలోని బట్టాపూర్ తండావాసులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జగదాంబ, సేవలాల్ ఆలయాల వద్ద బోగ్ బండార్ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బీమానాయక్, రవినాయక్, అంజి,సంతోష్, వెంకట్, బాదావత్ శివ, మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో గిరిజనుల ఆరాధ్యదైవమైన శ్రీసంత్ సేవాలాల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని తండాలతో పాటు మండల కేంద్రంలో గల ఏర్పాటు చేసిన సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో లాల్ సింగ్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సంత్ సేవలాల్ మహరాజ్ జయంతిని సిరికొండ మండలంలో బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని తండాల్లో సేవలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగ్‌బండార్‌ను నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పర్శ్యాన్‌తండా, గోప్యతండా, గాప్యానాయక్ తండా, సర్పంచ్ తండా జగదాంబ ఆలాయాల్లో పూజలు చేసి సేవలాల్ మహరాజ్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బంజరాసేవ సంఘం అధ్యక్షుడు పిపావత్ లస్కర్ నాయక్,జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజి నాయక్, బాలకిషన్‌నాయక్,బాల్‌రాజ్‌నాయక్,చందర్‌నాయక్ పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మద్దెపల్లిలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక జగదాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గిరిజన తండాలలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

డిచ్‌పల్లి: బంజార జాతి ఔన్నత్యంతో పాటు విశ్వమానవ అభివృద్ధికి సంత్ సేవలాల్ మహారాజ్ విశేషంగా కృషి చేశారని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. టీయూ బాలుర హాస్టల్ ఎదుట సంత్ సేవలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలు ఎస్సీ, ఎస్టీ, సెల్ డైరెక్టర్ డా.భ్రమరాంబిక అధ్యక్షతన గురువారం నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు చేపడతాం



ఫాగింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 15:బోధన్ పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు.దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించారు.పార్టీలకతీతంగా పట్టణంలోని అన్ని వార్డు లలో దోమల నివారణకు చర్యలు చేపడతామన్నారు.పట్టణ ప్రజలు తమ పరి సరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య సం రక్షణే తమ ధ్యేయమన్నారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్లుశరత్‌రెడ్డి, డబ్బుమీర్ నజీర్ అలీ,శానిటరీఇన్‌స్పెక్టర్ శంకర్‌లతో మున్సిపల్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు నవనాథ్ సిద్దేశ్వర స్వామి జాతర

ఇందల్వాయి,ఫిబ్రవరి15:మండలంలోని గన్నారం గ్రామంలో సిద్దుల గుట్ట వద్ద శుక్రవారం శ్రీనవనాత సిద్దేశ్వర స్వామి జా తర ఉందని ఈ జాతర ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని సూచించారు. ఉదయం 8గంటల నుంచి ఆలయ ఉత్సవాలు ప్రారంభమవుతాయని మధ్యాహ్నాం ఆలయ ఆవరణలో భక్తుల కోసం భోజన వసతి ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు



మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పంచరెడ్డి నర్సుబాయి సూరి, మృదుల అరుణ్‌లు మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు కొండపాక రాజేష్, బొబ్బిలి మురళి, పురుషోత్తం కూడా కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు బీఆర్ఎస్ నేతలు ప్రభు, సన్నబాలాజీ, నర్సింహా, నాయిని సృజన్, పుప్పాల రవి, మాకు రవి, బీఎల్ రాజు, పసుపుల సురేష్, అనిల్‌యాదవ్, గంపరాజులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశవేణు, నరాల రత్నాకర్, యువజన కాంగ్రెస్ నేత రామర్తిగోపి, నరాల సీహాల్, రాంబూపాల్, విజయ్‌పాల్, గంగాధర్, ధర్పల్లి అశోక్, కిషన్, అఫ్జల్, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌వైపు బీఆర్ఎస్ నగర నేతలు...

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నగర కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు కూ డా కాంగ్రెస్ వైపు బాట పడుతున్నారు. ఆ పార్టీ నేతలతో చర్చలుజరుపుతూ చేరుతున్నారు. పదవిలో ఉన్న కార్పొరేటర్లతో పాటు గతంలో పనిచేసిన వారు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా పనిచేసిన బిగాల గణేష్‌గుప్తాకు అనుచరులుగా ఉన్న వారు కూడా చేరడంతో చర్చనీయాంశమవుతోంది. శాసనసభ ఎన్నికల వరకు ఆయనతో ఉండి పనిచేసిన వారు కాంగ్రెస్‌లో చేరడంతో మరికొంత మంది కార్పొరేటర్లు కూడా చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్ నేతలు పట్టించుకోకపోవడం వల్ల పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆపార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

యువత చెడువ్యసనాలకు దూరముండాలి

● జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, ఫిబ్రవరి15: దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే ముఖ్యంగా యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురికికాల్వలను, రోడ్లను అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతితో పాటు అధికారులు పాల్గొన్నారు.

లక్కంపల్లిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.35వేల 300 స్వాధీనం ● 8 మంది అరెస్టు

నందిపేట, ఫిబ్రవరి15: నందిపేట మండలంలోని లక్కంపల్లి శివారులో ఉన్న సెజ్ భూముల్లో గురువారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజ్ ఆదేశాల మేరకు సీఐ అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. సుమారు రూ.35వేల 300 నగదు, సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. అలాగే 8 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని చర్యల నిమిత్తం నందిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎక్కడైనా పేకాట ఆడితే 100కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు లేదా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారాన్ని అందించాలని,వారి పేర్లుగోప్యంగా ఉంచుతామని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 15: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని నిజామాబాద్ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఎవరైనా గ్రూపు రాజకీయాలను, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలను ప్రోత్సహిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని అన్నారు. త్వరలో అర్బన్ కమిటీలను పునర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ జనరల్ సెక్రెటరీ సీహెచ్ హన్మంత్‌రావు, నాయకులు వినోద్‌కుమార్, సురేష్, జ్యోతినారాయణ, ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.